
ప్రజాశక్తి



పలువురు ఎస్‌ఐలకు బదిలీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పలువురు ఎస్‌ఐలకు బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డిఐజి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. విజయనగరం విఆర్‌లో ఉన్న ఎ.సన్యాసినాయుడును పూసపాటిరేగ ఎస్ఐగా, ఆండ్ర ఎస్ఐ బి.గణేష్‌ను డిసిఆర్‌బికి, కొత్తవలస స్టేషన్‌లో ఉంటూ విఆర్‌లో ఉన్న బి.దేవిని ఆండ్ర స్టేషన్‌కు బదిలీ చేశారు. సిసిఎస్ ఎస్ఐ ఎస్.సుదర్శన్ కొత్తవలస స్టేషన్‌కు, విజయనగరం టూటౌన్ ఎస్ఐ ఐ.దుర్గాప్రసాద్‌ను సిసిఎస్‌కు, ఎస్.కోట ఎస్ఐ జె.తారకేశ్వరరావును విజయనగరం వన్‌టౌన్‌కు బదిలీ చేశారు. విశాఖ సిటీ నుంచి భోగాపురం స్టేషన్‌కు అటాచ్ చేసిన డి.తాతారావును భోగాపురానికి , డి.రామును కొత్తవలసకు, ఎ.మోహన్‌రావును ఎస్.కోటకు బదిలీ చేశారు.



ధర్నా చేస్తున్న పింఛనుదారులు

సమస్యలు పరిష్కరించాలని
కలెక్టరేట్ ఎదుట పెన్షనర్ల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అపరిష్కృతంగా ఉన్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎపి పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు పెద్దింటి అప్పారావు మాట్లాడుతూ 11వ పిఆర్‌సిలో 2022 నుంచి తగ్గించిన అడిషనల్ క్వాంటమ్‌ను తిరిగి యథావిధిగా అంతకు ముందు ఇస్తున్నట్లు 70ఏళ్ల నిండిన వారికి 10శాతం, 75 ఏళ్ల నిండిన వారికి 15శాతానికి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న డిఆర్ బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. 11వ పిఆర్‌సి ఎరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డు ద్వారా అన్ని వ్యాధులకు అన్ని గుర్తింపు పొందిన ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందించాలని కోరారు. మెడికల్ రీ-ఇంబర్స్‌మెంట్ పరిధి 2 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. ధర్నాలో పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి, జి.నారాయణరావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు జిఆర్ రాఘవ రాజు, తాలుక యూనిట్ అధ్యక్షుడు వి.సూర్య నారాయణ, కార్యదర్శి సిహెచ్ త్రినాథ ప్రసాద్, వి.సత్తి రాజు తదితరులు పాల్గొన్నారు.

జీవన పరిస్థితుల మార్పే లక్ష్యం

- ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ఆర్ ఆసరా అమలు
- చీపురుపల్లిలో 100 పడకల ఆసుపత్రికి త్వరలో శంకుస్థాపన
- ఆసరా సంబరాల్లో మంత్రి బొత్స



సభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-చీపురుపల్లి

రాష్ట్రంలోని మహిళల జీవన స్థితిగతులు మార్చేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. మహిళలకు తమ కుటుంబాల్లో గౌరవం పెంచేందుకే ప్రతి పథకాన్ని మహిళల పేరుతో అందించేలా చర్యలు చేపట్టారని పేర్కొన్నారు. మండల స్థాయిలో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత సంబరాల కార్యక్రమం స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయ మైదానంలో సోమవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ పథకాలను అర్హులైన వారందరికీ ఎటువంటి అవినీతికి, రాజకీయ పక్షపాతానికి తావులేకుండా అందిస్తున్నామని పేర్కొన్నారు. చీపురుపల్లిలో త్వరలోనే వంద పడకల ఆసుపత్రికి శంకుస్థాపన చేయనున్నామని, ఈ ఆసుపత్రి ఏర్పాటుతో ఈ ప్రాంత వాసులు వైద్య అవసరం కోసం విజయనగరం వెళ్లాల్సిన అవసరం ఉండదని అన్నారు. రాజకీయం అంటే మోసం చేయడం కాదని, ప్రజలకు సేవ చేయడమని టిడిపి నాయకులను ఉద్దేశించి అన్నారు. గ్రామాల్లోకి టిడిపి నాయకులు వస్తే నిలదీయాలన్నారు. సభలో ఎంపి బెల్లాన చంద్రశేఖర్, జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడారు. ఈ సందర్భంగా చీపురుపల్లి మండలంలోని 14,727 మంది స్వయంశక్తి సంఘాల మహిళలకు రూ.11.54 కోట్ల వై.ఎస్.ఆర్.ఆసరా మొత్తాలకు సంబంధించిన చెక్కును మంత్రి బొత్స సత్యనారాయణ చేతుల మీదుగా అందజేశారు.

అంతకు ముందు కనకమహలక్ష్మి అమ్మవారి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం 20.80 లక్షలతో నిర్మాణం చేసిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను మంత్రి ప్రారంభించారు. రూ.23,94 లక్షల వ్యయంతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని మంత్రి ప్రారంభించారు. చీపురుపల్లి మేజర్ పంచాయతీకి చెందిన 41 మంది ఇళ్లులేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలను కూడా మంత్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌సి రఘురాజు, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, ఆర్‌డిఒ బి.శాంతి, జెడ్‌పిటిసి వలిరెడ్డి శిరీష, ఎంపిపి ఇప్పిలి వెంకటనరసమ్మ, వైసిపి నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, బొత్స సందీప్ నాయుడు, వైసిపి జిల్లా యువ నాయకులు బెల్లాన వంశీకృష్ణ, వైస్ ఎంపిపిలు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని
నేడు సత్యాగ్రహం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మున్సిపల్ కార్మికుల సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలకు తక్షణమే జీవోలు విడుదల చేయాలని కోరుతూ మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సత్యాగ్రహం చేస్తున్నట్లు ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహన్రావు, నాయకులు బొగ్గు భాస్కరరావు తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ కమిషనర్‌కు, మున్సిపల్ హెల్త్ అధికారికి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ విజయనగరం పంప్ హౌస్ కార్మికులకు 2 నెలల నుంచి 6 నెలల వరకు జీతాలు, పారిశుధ్య కార్మికులకు 2 నెలల హెల్త్ అలవెన్స్‌లు బకాయిలు ఉన్నాయని, అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కరించడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ నిర్బంధం, అధికారుల ఒత్తిడిని ఎదుర్కొని 16 రోజులు మున్సిపల్ కార్మికులు సమ్మె చేశారని, గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ అంగీకరించి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలకు జీవోలు తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సంక్రాంతి కానుక వెయ్యి రూపాయలు తక్షణమే జమ చేయాలని, పనిముట్లు రక్షణ పరికరాలతో పాటు యూనిఫామ్ కుట్టుకూలీ డబ్బులు చెల్లించాలని మున్సిపల్ ప్రజారోగ్య అధికారి కె.సాంబమూర్తికి, పంప్ హౌస్ కార్మికులకు బకాయి వేతనాలు ఇవ్వాలని కోరుతూ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ రావుకు, మున్సిపల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.శ్రీనివాసరావుకు వినతులు ఇచ్చినట్లు తెలిపారు.

జెకెసికి వినతుల వెల్లువ

ప్రజాశక్తి-విజయనగరం కోట

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో ప్రజల నుంచి వినతులు వెల్లువెత్తాయి. మొత్తం 311 వినతులు అధికారులకు అందాయి.వాటిలో రెవెన్యూకు సంబంధించి 120 వినతులు ఉన్నాయి. డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సుదర్శనదొర, సుమబాల తదితరులతో కలసి వినతులు స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖలకు పరిష్కారంకోసం సిఫారసు చేశారు.

టోల్‌గేట్ పనులు వెంటనే ఆపాలి

జొన్నాడ సమీపంలో గోడమెట్టపాలెం వద్ద టోల్‌గేటు ఏర్పాటు చేసేందుకు జరుగుతున్న పనులను వెంటనే ఆపాలని టిడిపి నియోజకవర్గ నాయకులు వినతినిచ్చారు. విజయనగరం-విశాఖపట్నం రహదారిలో టోల్‌గేటే ఏర్పాటు చేయడం వల్ల ప్రయాణికులపై అధిక భారం పడుతుందని తెలిపారు. ఇది జాతీయ రహదారి కాదని అన్నారు. ప్రభుత్వం స్పందించి టోల్‌గేట్ ఆపాలని కోరారు. వినతినిచ్చిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి .రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, కోండ్రు శ్రీనివాసరావు, కనకల మురళీమోహన్ ఇతర నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు .

రైతుల దగ్గర గల ధాన్యాన్ని పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని టిడిపి నాయకులు వినతినిచ్చారు. 2022 -23 రైతులు పంట బీమా నష్టాన్ని ఇప్పటికీ రైతులకు పూర్తి స్థాయిలో ఇవ్వాలన్నారు. జిల్లాలో బెల్ట్ షాపులను వెంటనే ఆపాలని గౌతు లచ్చన్న కల్లుగీత వత్తిదారుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు.



డిఆర్‌ఒకు వినతి అందిస్తున్న టిడిపి నాయకులు

డేటా అప్‌లోడ్ చేయాలి : డిఆర్‌ఒ

ఎన్నికల విధులకు సంబంధించిన పోర్టల్ లో అధికారుల, సిబ్బంది వివరాను పోలింగ్ పర్సనల్ మేనేజ్మెంట్ సిస్టంలో డేటా అప్‌లోడ్ చేయాలని డిఆర్‌ఒ అనిత తెలిపారు. ఆన్లైన్ లో ఎలా అప్లోడ్ చేయాలనే అంశాల పై ఎన్‌ఐసి డిఐఒ బాలసుబ్రహ్మణ్యం అధికారులకు అవగాహన కలిగించారు. అన్ని శాఖల కంప్యూటర్ ఆపరేటర్లకు ఎన్‌ఐసిలో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

నేడు కలెక్టరేట్‌కు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 30న 33/11 కెవి కలెక్టరేట్ సబ్ స్టేషన్ లో గల అన్ని విభాగాల నిర్వహణ నిమిత్తం కలెక్టరేట్‌కు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎపి ఇపిడిసిఎల్ ఇఇ పి.హరి తెలిపారు. పావని నగర్, అరుంధతి నగర్, కాంబోయి వీధి, రెల్లివీధి, గణేష్ కోవెల రోడ్, హోటల్ షాలిమార్ వెనుక వీధి, మర్రి చెన్నారెడ్డి కాలనీ, సిక్కులకాలనీ, రామయ్యమ్మ కాలనీ, బిసి కాలనీ, యాతపేట, జర్నలిస్ట్ కాలనీ, రాజుల కాలనీ, ద్వారపూడి రోడ్, రెవిన్యూ కాలనీ, బ్యాంకు కాలనీ, సాయి కీర్తన నగర్, కామాక్షి నగర్, సాయి లలితా నగర్, కెఎల్ పురం తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

కమ్యూనిటీ కాంట్రాక్టు పద్ధతిలో జెజెఎం పనులు

ప్రజాశక్తి-విజయనగరం

గ్రామ జల సంఘాలకు కమ్యూనిటీ కాంట్రాక్టు పద్ధతిపై మండలస్థాయి అధికారుల ఒకరోజు శిక్షణ కార్యక్రమం సోమవారం ఆన్‌లైన్ ద్వారా నిర్వహించారు. గ్రామీణ నీటిసరఫరా విభాగం పర్యవేక్షక ఇంజినీర్ బి.ఉమాశంకర్, జెడ్‌పి సిఇఒ. కె.రాజ్‌కుమార్ పాల్గొన్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు గ్రామ జలసంఘాల ఆధ్వర్యంలో సిసిఎస్ ద్వారా చేయడానికి మార్గదర్శకాలు, సూచనలు, కార్యాచరణ పద్ధతిపై ఎస్‌ఇ ఉమాశంకర్ వివరించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ఎవిఎస్ రాజన్, డిఇఇలు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, ఎఇఇలు, ఇంజనీరింగ్ సహాయకులు, పంచాయతీ కార్యదర్శులు, డిపిఎంయు సిబ్బంది పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న ముస్లిం, మైనార్టీ నాయకులు

ఐక్య పోరాటమే మార్గం

ప్రజాశక్తి-విజయనగరం కోట

మత స్వేచ్ఛ, సమానత్వపు హక్కు కోసం ఐక్యంగా పోరాడడమే మార్గమని ముస్లిము, మైనార్టీస్ నాయకులు అన్నారు. కలెక్టరేట్ వద్ద సోమవారం క్రిస్టియన్, ముస్లిం, ఎస్‌సి, ఎస్‌టి మైనారిటీస్ ఐక్య కలయిక ఘనంగా జరిగింది. ఆలిండియా క్రిస్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు పి. ప్రేమానందం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో పలువురు తమ సందేశాలు వినిపించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎపి మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్, డైరెక్టర్ జవాబ్ మహమ్మద్ నాసిర్ మాట్లాడుతూ ప్రాథమిక హక్కులను కాపాడుకోవడం అందరి బాధ్యతన్నారు. మతం, జాతి, కులం, లింగం భేదము లేకుండా అందరికి సమానత్వపు హక్కును రాజ్యాంగం కల్పించిందని, వాటిని కాపాడుకోవాలని అన్నారు. కాని నేడు దేశంలో ముస్లిం, మైనార్టీలో అభద్రతా భావానికి గురవుతున్నారని తెలిపారు. లౌకిక రాజ్యాన్ని కాపాడు కునేందుకు, మన పిల్లల భవిష్యత్తు కోసం అందరం సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.

హైకోర్టు న్యాయవాది, ఆలిండియా ప్రార్ధన విజ్ఞప్తి సమితి అధ్యక్షులు డి.సుధాకర్ మాట్లాడుతూ నిజమైన స్వాతంత్ర్యం కోసం అందరం కలిసికట్టుగా శ్రమించాలన్నారు. వైసిపి మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోనియామడి, పలువురు నాయకులు మాట్లాడారు.

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఫిర్యాదుదారులకు తక్షణ న్యాయం చేయాలని ఎస్‌పి ఎం.దీపిక అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ వారం 44 ఫిర్యాదులు అందాయి. బాధితుల సమస్యలను తెలుసుకొని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో మాట్లాడి, పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, న్యాయం చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్, దిశ డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ జె. మురళి, ఎస్‌బి సిఐ ఇ. నర్సింహమూర్తి, ఎస్‌ఐలు సిద్ధార్థ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న ఎస్‌పి దీపిక



నిరసన తెలుపుతున్న కార్మికులు, వారి కుటుంబ సభ్యులు

సిపి పరిశ్రమ వద్ద కార్మికుల నిరసన

ప్రజాశక్తి - పూసపాటిరేగ

మండలంలోని సిపి ఆక్వా రొయ్యమేత పరిశ్రమ వద్ద కార్మిక నాయకుడు నల్ల అప్పలరాజు ఆధ్వర్యంలో కార్మికులు కుటుంబాలతో సహ సోమవారం నిరసన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకారణంగా తొలగించిన 48 మంది కార్మికులను విధుల్లోకి తీసుకునేంతవరకూ శాంతియుత పోరాటం చేస్తూనే ఉంటామన్నారు. స్థానికులకు పనిలేకుండా చేయడం అన్యాయమన్నారు. యాజమాన్యం మంచిగా ఉన్నా అందులో కాంట్రాక్టర్‌లు లక్ష్మినారాయణ, వైస్ ఎంపిపి సత్యనారాయణ రాజు కార్మికులకు వ్యతిరేకంగా ఉండడం అన్యాయమన్నారు. వారి పబ్బం గడుపుకోవడానికి కార్మికులను బలిచేస్తున్నారన్నారు. వారి మాట విని యాజమాన్యం కూడా మొండి వైఖరితో కార్మికులను పనిలోకి తీసుకోవడంలో జాప్యం చేస్తుందన్నారు. ఈ పరిశ్రమ వల్ల తమ నేలలు, నీరు, గాలి కాలుష్యం అయ్యాయన్నారు. తమకు పని ఇవ్వకపోతే కాలుష్యం రాకుండా నివారించుకోవాలన్నారు. పరిశ్రమలో ప్రభుత్వ భూమి 6.47 సెంట్లును ప్రభుత్వం స్వాదీనం చేసుకోవాలన్నారు. దీనిపై తామే చట్టపరంగా పోరాటం చేస్తామన్నారు. తమకు సహకారం లేని కంపెనీకి మేమెందుకు సహకారంగా ఉండాలన్నారు. సమస్య పెద్దది చేసుకోకుండా పరిష్కరించుకోవాలన్నారు. లేకపోతే బారీ పోరాటం తప్పదని హెచ్చరించారు. నిరసనలో కార్మిక కుటుంబాలు పాల్గొన్నాయి.

జల్సాలకు బానిసై..

- బంగారం కోసం వృద్ధురాలిని హతమార్చిన ఇంజినీరింగ్ విద్యార్థి
- బాత్రూమ్‌లో జారిపడి చనిపోయినట్లు చిత్రీకరణ
- ఊపిరాడిక చనిపోయినట్లు పోస్టుమార్టంలో నివేదిక



వివరాలు వెల్లడిస్తున్న సిఐ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భోగాపురం

మద్యానికి, జల్సాలకు బానిసైన ఇంజినీరింగ్ విద్యార్థి బంగారం కోసం తాను అద్దెకు ఉంటున్న యజమానురాలునే హత్య చేశాడు. బాత్రూమ్‌లో కాలుజారి పడిపోయి చనిపోయిందని నమ్మించే ప్రయత్నం చేశాడు. ఊపిరాడిక చనిపోయినట్లు పోస్టుమార్టం రిపోర్ట్‌లో తేలడంతో పోలీసులు లోతుగా విచారించారు. దీంతో తానే హత్య చేసినట్లు ఆ ఇంజనీరింగ్ విద్యార్థి ఒప్పుకున్నాడు. అతని వద్ద నుంచి ఆరున్నర తులాల బంగారాన్ని రికవరీ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను సిఐ బివి వెంకటేశ్వరరావు, ఎస్‌ఐ సూర్య కుమారి సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. విజయనగరం మండలం గుంకలాం గ్రామానికి చెందిన ఇజ్జరపు కూర్మారావు తగరపువలస బ్రిడ్జి సమీపంలోని ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చివరి సంవత్సరం చదువు తున్నాడు. రాజపులోవ పంచాయతీ మహారాజుపేటలోని ముద్దాడ అప్పయ్యమ్మ అనే వృద్ధురాలు ఇంట్లో మరో ఇద్దరు స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. ఇద్దరు స్నేహితులు సంక్రాంతి పండగకు ఇంటికి వెళ్లి ఇంకా తిరిగి రాలేదు. దీంతో రూమ్‌లో ఒక్కడే ఉంటున్నాడు. జల్సాలకు అలవాటు పడి గదిలో అప్పుడప్పుడు అమ్మాయిలు, మద్యం తాగి పార్టీలు చేసుకునేవాడు. ఈ విషయం తెలిసి అప్పయ్యమ్మ మందలించి గొడవపడేది. ఈ నేపథ్యంలో ఈ నెల 25వ తేదీన గది వద్దకు వచ్చిన అప్పయ్యమ్మకు ఊపిరాడకుండా నోరు ముక్కు మూయడంతో ఆమె చనిపోయింది. ఆమె ఇంటి వద్ద ఉన్న బాత్రూమ్‌లోకి తీసుకువెళ్లి ఒంటి పైనున్న బంగారాన్ని తీసేసి కాలుజారి పడిపోయినట్లు పడేశాడు. అదే రోజు పోలీసులకు సమాచారం రావడంతో వెంటనే వెళ్లి పరిశీలించారు. బంగారం మాయం కావడంతో అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో కూర్మారావు నడవడికపై అనుమానం వచ్చి విచారణ చేయడంతో నేరం ఒప్పుకున్నాడు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసు దర్యాప్తులో పాల్గొన్న సిబ్బందిని సిఐ అభినందించారు.

20 తులాలు బంగారం ఉంటుందని ప్రచారం

హత్యకు గురైన అప్పయ్యమ్మ ఒంటిపై సుమారు 20 తులాలు బంగారం ఉంటుందని గ్రామంలో ప్రచారం జరుగుతుంది. అయితే పోలీసులు కేవలం ఆరున్నర తులాలు మాత్రమే నిందితుడు తీసినట్లు తెలిపారు. దీనిపై విలేకరులు సిఐను ప్రశ్నించగా అలాంటిదేమీ లేదని, ఇది అవాస్తవమని అన్నారు. ఆమె కుటుంబ సభ్యులు అలాంటిదేమి తమ దృష్టికి తీసుకు రాలేదని ఆయన అన్నారు.

2న తాటిపూడిలో సదస్సు

గుర్ల : ఉత్తరాంధ్ర సుజల స్రవంతి భూ నిర్వాసిత పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 2న తాటిపూడిలో జరగబోయే సదస్సును విజయవంతం చేయాలని కమిటీ కన్వీనర్ చల్లా జగన్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మండలంలోని కొండగండ్రేడు, పకీరు కిత్తలి గ్రామాలలో జిల్లా రైతు సంఘం కార్యదర్శి బుద్ధరాజు రాంబాబుతో కలసి సోమవారం నిర్వాసితులను కలిశారు. ఫిబ్రవరి 2న తాటిపూడి శివాలయం వద్ద బాధిత రైతులతో సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రైతులకు నష్టం తగ్గే విధంగా కాలువ అలైన్మెంట్ మార్పు చేయాలన్నారు. ప్రస్తుతం అలైన్మెంట్‌లో ప్రభుత్వం గుర్తించిన భూముల అమ్మకాలు కొనుగోళ్లు జరిగే విధంగా 1బిలపై ఉన్న రెడ్ మార్క్‌ను తొలగించాలన్న డిమాండ్‌లతో సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు.

నేటి నుంచి కుష్టు వ్యాధిపై అవగాహన

విజయనగరం కోట : కుష్టువ్యాధిపై అవగాహన అవసరమని డిఎంహెచ్ఒ డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. సోమవారం తన కార్యాలయంలో లెప్రసీపై అవగాహన కార్యక్రమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13వరకు కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. వివక్షత లేని సమాజం కోసం గ్రామ సభలలో ప్రస్తావించాలని సూచించారు. శరీరంపై ఎవరికైనా స్పర్శ లేని మచ్చలు ఉంటే దగ్గరలోగల పిహెచ్‌సిల్ల చూపించాలని తెలిపారు. కార్యక్రమంలో అదనపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె. రాణి, జిల్లా టీకా నియంత్రణ అడికారి ఆర్. అచ్చుత కుమారి, ఉప జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్. సూర్య నారాయణ, జిల్లా న్యూక్లియర్ వైద్యాధికారి రామేశ్వరి ప్రభ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఇసిఎస్‌లో అవినీతిపై బొత్స నోరువిప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు కిమిడి నాగార్జున

ప్రజాశక్తి-గరివిడి

ఆర్‌ఇసిఎస్‌లో ఎనర్జీ అసిస్టెంట్ల నియామకంలో జరిగిన అక్రమాలు, అవినీతిపై మంత్రి బొత్స సత్యనారాయణ నోరు విప్పాలని టిడిపి జిల్లా అధ్యక్షులు కిమిడి నాగార్జున డిమాండ్ చేశారు. గరివిడి మండలానికి సంబంధించి స్థానిక లయన్సు క్లబ్ సమావేశ మందిరంలో జయహో బిసి సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ ఐటిఐ నకిలీ సర్టిఫికెట్లు సమర్పించిన వారికి ఉద్యోగాలు కల్పించి భారీగా అక్రమాలు జరిగాయని విజిలెన్స్ తనిఖీల్లో వెల్లడైందని అన్నారు. పోస్టుల భర్తీలో నిబంధనలు పాటించలేదని, అర్హతలు లేని వారికి ఉద్యోగాలు ఇచ్చారని విచారణలో తేలిందన్నారు. దీనిపై మంత్రి బొత్స మౌనం వీడలన్నారు. ఈఅవినీతిపై మంత్రి నోరు విప్పకపోవడం పలు అనుమానాలకు తావిస్తుందన్నారు. నాలుగున్నర సంవత్సరాలు నియోజకవర్గాన్ని గాలికి వదిలేసిన మంత్రి బొత్స ఎన్నికల ముందు నియోజకవర్గ పర్యటనలతో హడావిడి చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు అల్లు విజయకుమార్, కర్రోతు నరసింగరావు, గుర్జాపు రాము,దుమ్ము అశోక్, పొగిరి పైడిరాజు, పైల బలరాం, వెన్నె సన్యాసి నాయుడు, ముల్లు రమణ,బలగం వెంకట్రావు, దన్నాన రామచంద్రుడు, వెంపడాపు రమణమూర్తి, మహంతి రమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

బిసిలను అణగదొక్కిన జగన్

డెంకాడ : రాష్ట్రంలో బీసీలను అణగదొక్కిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి పతివాడ నారాయణ స్వామినాయుడు, టిడిపి నియోజకవర్గం ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు తెలిపారు. టిడిపి ఆధ్వర్యంలో మండలంలోని పినతాడివాడ గ్రామంలో సోమవారం జయహో బిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో బీసీలకు ఉన్నత స్థానం కల్పించామని బీసీలలో అణగారిన వర్గాలకు ఆదరణ పథకం కింద వివిధ రకాల పనిముట్లను ఇచ్చామని గుర్తు చేశారు. ఇప్పుడు వైసిపి ప్రభుత్వం బీసీలను అణగదొక్కుతుందని, తీవ్ర అన్యాయం చేస్తుందని అన్నారు. బీసీలంతా ఏకతాటిపై నిలబడి వచ్చే ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వానికి బుద్ధి చెప్పి టిడిపి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కంది చంద్రశేఖరరావు, పతివాడ అప్పలనారాయణ, పల్లె భాస్కర్‌రావు, కలిదిండి పాణిరాజు, వెన్నె సన్యాసి నాయుడు, కర్రోతు నర్సింగరావు, పొగిరి పైడిరాజు, అల్లు విజయ్ కుమార్, కాగితాల సత్యనారాయణ రెడ్డి, కొర్నాన ఆదిబాబు, కొయనేని రమణ, చిల్ల పద్మ, ముసలినాయుడు, ముని పైడయ్య, బంటుపల్లి మురళి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న పల్సస్ సంస్థ సిఇఒ శ్రీనుబాబు

వ్యవసాయ స్టార్టప్‌ను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి- డెంకాడ

వ్యవసాయ స్టార్టప్స్ ప్రోత్సహించాలని పల్సస్ సిఇఒ గేదెల శ్రీనుబాబు అన్నారు. లెండి కళాశాలలో ఇన్నోవేషన్ ఇంక్యూబేషన్ సెల్, ఎంట్రెప్రేనూర్షిప్ డెవలప్మెంట్ సెల్ సంయుక్తంగా ప్రోసెస్ ఆఫ్ ఇన్‌వేషన్ డవలప్‌మెంట్ అండ్ టెక్నాలజీ రెడీనెస్ లెవెల్ అనే అంశంపై సోమవారం నిపుణుల ప్రసంగించారు. ఈ సందర్భంగా శ్రీనుబాబు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో వనరులను ఉపయోగించి ఉత్తమ ఆంధ్రగా మారటానికి విద్యార్థులు స్టార్టప్స్ నెలకొల్పాలని సూచించారు. స్థానిక సమస్యలను స్థానిక వనరులను, టెక్నాలజీ, స్థానిక స్టార్టప్స్ ద్వారానే సమర్ధ వంతంగా పరిష్కరించ వచ్చునని తెలిపారు. ఎయు సెలక్టర్ కవిత సిరుగుడి, బొసియా డైరెక్టర్ బావిశెట్టి కిరణ్ కుమార్ పాల్గొని మాట్లాడుతూ కెరీర్, గోల్, అభిరుచులను తెలుసుకొని, సమాజాభివృద్ధికి దోహద పడాలని విద్యార్థులకు హితవు పలికారు. కళాశాల ప్రిన్సిపల్ వివి. రామరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత స్టార్టప్స్‌ని నెలకొల్పటంతో వారి ప్రాంతానికి పలుమందికి ఉపాదిని అందించవచ్చునని అన్నారు. కార్యక్రమంలో ఇన్నోవేషన్, ఇంక్యూబేషన్ సెల్ నిర్వాహకులు డాక్టర్ ఎ.వి. పరాంకుశం, ఎంట్రెప్రన్యూర్షిప్ సెల్ నిర్వాహకులు డాక్టర్ పి.తిరుమల, కోఆర్డినేటర్ డాక్టర్ వర ప్రసాద్, డాక్టర్ వినోద్ కుమార్, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ టి.హరిబాబు, పలు విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

న్యాయవాదుల నిరాహార దీక్షలు

గజపతినగరం : భూ యాజమాన్య హక్కు చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ గజపతినగరం బార్ అసోసియేషన్ న్యాయవాదులు బి.సూర్యారావు ఆధ్వర్యాన న్యాయవాదులు సోమవారం బోడసింగిపేట వద్ద నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ యాజమాన్య హక్కు చట్టం- 2022ను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు య.రమేష్ రాజు, సిహెచ్.తిరుపతిరావు, ఆర్.శ్రీనివాస నాయుడు, కె.రామునాయుడు, కె.శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై నిత్యం నిఘా

రామభద్రపురం : మండలంలో అక్రమ మద్యంపై నిత్యం నిఘా ఉంచుతామని ఎస్ఇబి జ్ఞాన ప్రసాద్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ దుకాణాల నుంచి బెల్టుషాపులకు మద్యం తరలిస్తే, అట్టి దుకాణాలపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామాల్లో గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్న వారిపై సమాచారం సేకరించామని తెలిపారు. మద్యం అమ్మకాలు చేస్తూ పట్టుబడితే కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తామని హెచ్చరించారు. బహిరంగ మద్యపానం, దాబాల్లో మద్యం విక్రయాలు, ఆగంతుకులకు అనుమతులు ఇస్తే అట్టి దాబా నిర్వాహకులపైనా చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే సారా తయారీపై దాడులు ముమ్మరం చేశామన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, జూదం, బెట్టింగ్ వంటి చట్ట విరుద్ధ కలాపాలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

బేబినాయన ఔదార్యం


బోరు పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్ రమేష్‌నాయుడు

తెర్లాం : టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన మరోసారి మంచి మనసు చాటుకున్నారు. మండలంలోని డి.గదబవలస గ్రామస్తులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఆయన.. బోరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేశారు. దీంతో డి.గదబవలస గ్రామంలో సోమవారం సర్పంచ్ జావాన రమేష్‌నాయుడు ఆధ్వర్యాన బోరు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తోపాటు వైస్ సర్పంచ్ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ రామారావు, మాజీ ఎంపిటిసి అప్పలస్వామి, టిడిపి నాయకులు జె.కృష్ణ, కె.విస్సంనాయుడు, రాంబాబు, కె.రామునాయుడు, స్వామి, గోవింద, పాస్టర్ గురుమూర్తి, జీవన్ కుమార్... బేబినాయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయాలి

బొబ్బిలిరూరల్ : ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేయడంలో ప్రతి సంఘం ముందుండాలని ఎంపిడిఒ రవికుమార్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ కమ్యూనిటీ కాంట్రాక్టింగ్ పద్ధతిపై గ్రామ జల సంఘాలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ కుళాయి ఏర్పాటు చేయడంలో, వాటి నిర్వహణలో సంఘాలు ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ ఇపిఎంది రెడ్డి, ఎఇలు శ్రావణ్ కుమార్, ప్రవీణ్, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఖోఖో పోటీలకు జొన్నవలస విద్యార్థులు

విజయనగరం టౌన్ : జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో జరుగనున్న అండర్ 14 జాతీయ ఖో ఖో పోటీలకు జొన్న వలస జెడిపి హైస్కూల్ విద్యార్థులు డి.యుగంధర్, ఎ.తులసి ఎంపికయ్యారు. వీరు చిత్తూరు జిల్లాలో జరుగుతున్న శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపిక కావడం పట్ల హెచ్ఎం విజయలక్ష్మి, జెడిపిటిసి కెల్ల శ్రీనివాసరావు అభినందించారు.

మండల విప్ కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

రేగిడి : మండలంలోని సంకిలి గ్రామానికి చెందిన ఎంపిటిసి మజ్జి సంధ్య, మండల విప్ మజ్జి శ్రీనివాసరావు తల్లి సత్యమ్మ మృతి చెందిన విషయాన్ని తెలుసుకొని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, రాజాం నియోజకవర్గం వైసిపి ఇంచార్జి తలే రాజేష్ పరామర్శించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ నుంచి వైసిపి వరకు పార్టీకి సేవలందించారన్నారు. వీరితోపాటు వైస్ ఎంపిపి బూరాడ జగన్మోహన్‌రావు, ముంజేటి కిషోర్, రెడ్డి నరసింగరావు, రాయపురెడ్డి శ్రీకాంత్, ఉన్నారు.

సోంపురం పాఠశాల సందర్శన

వేపాడ : మండలంలోని సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలను ఎంఇఒ పి.బాలభాస్కరరావు సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిపిఎం రాజు, సిఆర్‌పి కె.రాంప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీకి తీవ్రగాయం

మెంటాడ : మెంటాడలో అనంతసాగరం చెరువులో సోమవారం తుప్పలను కత్తులతో తొలగిస్తుండగా పోరకొరి చేతిలో ఉన్న కత్తి జారిపోయి వినినిగిరి అప్పారావు తలకు తీవ్ర గాయమైంది. ఫీల్డ్ అసిస్టెంట్ సువ్వాడ గిరినాయుడు, తోటి కూలీలు ప్రాథమిక చికిత్సచేసి, మెంటాడ పిహెచ్‌సికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉండని గజపతినగరం సిహెచ్‌సికి తరలించారు. అక్కడ అప్పారావు చికిత్స పొందుతున్నాడు.

చట్టాలపై అవగాహన ఉండాలి

శృంగవరపుకోట : ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని విశాఖపట్నం సిఐడి డిఎస్‌పి కుమారస్వామి అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అట్రాసిటీ చట్టం ఎస్సీ, ఎస్టీలకు వరం లాంటిదని, దీని ద్వారా వారికి న్యాయం జరుగుతుందని తెలిపారు. అనంతరం దళిత నాయకులు కదారి జయశంకర్, గణేష్ మాట్లాడుతూ ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాల వల్ల అట్రాసిటీ చట్టం నీరుగారిపోతోందన్నారు. దాడులకు గురైన దళితులు కేసులు పెట్టేందుకు వెళ్ళినప్పుడు వారిపై పెత్తందారులు బెదిరింపులకు దిగుతున్నారని, ఆ సమయంలో పోలీసులు రక్షణగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో సిఐడి ఎస్ఐ నాగేశ్వరరావు, తహశీల్దార్ శ్రీనివాసరావు, మాజీ ఎంపిపి ఒంటి అప్పారావు, గిరిజన నాయకులు కేత వీరన్న, వైసిపి నాయకులు పి.జగదీష్ పాల్గొన్నారు.

ఒత్తిడిని దూరం చేస్తేనే ఫలితం


బాడంగి : ఒత్తిడి, భయాన్ని దూరం చేస్తేనే విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధిస్తారని డిప్యూటీ డిఇఒ పి.బ్రహ్మాజీరావు తెలిపారు. బాడంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం దేశవ్యాప్తంగా ప్రధాని మోడీ నిర్వహించిన పరీక్షా పే చర్చ-2024 కార్యక్రమాన్ని టీవీ ద్వారా ఆయనతోపాటు ఎంపిటిసి శ్రీనివాసరావు తిలకించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. వంటగది పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, నాణ్యమైన భోజనం పెట్టాలని సూచించారు. ఉపాధ్యాయులతో సమావేశం ఏర్పాటు చేసి, పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతకు ఉపాధ్యాయులు తీసుకుంటున్న చర్యలను సబ్జెక్టు వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి సబ్జెక్టులో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ఈ 40 రోజులు యాక్షన్ ప్లాన్ అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం చల్లా సత్యనారాయణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా వీరబ్రహ్మేంద్రస్వామి తీర్థం

కొత్తవలస : కొత్తవలస- కె.కోటపాడు రోడ్డులో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో సోమవారం తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ సాంఘిక సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, చిడతల ప్రదర్శన, బాలనాగమ్మ బుర్రకథ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి.

ముగిసిన పరదేశమ్మ జాతర

వేపాడ : వేపాడ మండల కేంద్రంలో నిర్వహించిన పరదేశమ్మ ముత్యాలమ్మ జాతర సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పోటీలు హోరాహోరీగా సాగాయి. రంగవల్లుల పోటీల్లో భాగంగా మహిళలు గీసిన ముగ్గులు ఆకట్టుకున్నాయి. విజేతలకు సర్పంచ్, నాయకులు నగదు, బహుమతులు అందజేశారు.


పోటీలో పాల్గొన్న ఎడ్లబండి

నేటి నుంచి వావిలపాడు జాతర

మండలంలోని వావిలపాడు గ్రామంలో పరదేశిమాంబ జాతర మంగళవారం ప్రారంభం కానుంది. మంగళ, బుధవారాల్లో నిర్వహించే జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు సర్పంచ్ బీల రాజేశ్వరి, వైసిపి నాయకులు బీల సతీష్ తెలిపారు. జాతర సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అధికారులపై ఆక్రోశం

రామభద్రపురం మండల సమావేశంలో విరుచుకుపడ్డ సభ్యులు



అధికారులను నిలదీస్తున్న మామిడివలస ఎంపిటిసి తిరుపతిరావు

ప్రజాశక్తి-రామభద్రపురం

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని సోమవారం ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం నుంచే అధికారుల పనితీరును ఎండగడుతూ ప్రతిపక్ష టిడిపి సర్పంచ్, ఎంపిటిసి సభ్యులు నిప్పులు చెరిగారు. ముఖ్యంగా పంచాయతీ రాజ్ ఎఇ రమేష్ పనితీరుపై ప్రతిపక్ష సభ్యులతో అధికార పార్టీ సభ్యులు, ఎంపిపి సైతం గొంతుకలిపి, విరుచుకుపడ్డారు. భూశాయవలసలో ఆర్‌బికె భవనాన్ని ప్రారంభించి, నెలలు కావస్తున్నా పంచాయతీరాజ్ ఎఇ నిర్లక్ష్య వైఖరితో బిల్లులు కాలేదని మామిడివలస ఎంపిటిసి మడక తిరుపతిరావు నిలదీశారు. జీతాలు రెండు రోజులు ఆలస్యమైతే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే మీరు, నిర్మాణాలు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా చేసిన పనులకు ఎందుకు బిల్లులు చెల్లించడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బిల్లులు పెండింగ్, ఎంబుక్ రికార్డింగులపై ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు స్పందిస్తూ ఎఇ పనితీరు బాగాలేదని, స్థానికంగా నివాసం ఉండకుండా, సమయపాలన పాటించకుండా ఇబ్బందులు పెడుతున్నట్లు తనకు కూడా ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. పనితీరు మెరుగు పరుచుకోవాలని సూచించారు.

రొంపల్లి, రామభద్రపురం ఎంపిటిసిలు భవిరెడ్డి శంకరరావు, చంద్రరావు, నర్సాపురం సర్పంచ్ కోట వెంకటనాయుడు తమ పరిధిలో ఉన్న తీరని సమస్యలపై అధికారులను నిలదీశారు. సమావేశాల్లో లేవనెత్తడమే తప్ప పరిష్కరించడం లేదని, సంతకాలు చేసి వెళ్లిపోవడమే ఉత్తమమని ఆవేదన వ్యక్తం చేశారు. నాడు-నేడులో భూశాయవలస హైస్కూల్ అదనపు గదులు నిర్మాణాలు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదన్నారు. రొంపల్లి, వంగపండువలస పాఠశాలల్లో గదులు వర్షానికి కారేస్తున్నా పనులు చేయలేదు సరికదా ఇక్కడ కేటాయించిన నిధులు అనకాపల్లి జిల్లాకు తరలిపోవడం ఏమిటని ప్రశ్నించారు. రావివలస సర్పంచ్ కుమారి తమ గ్రామంలో పాఠశాల నిర్మాణం పూర్తి చేసి నెలలు కావస్తున్నా బిల్లులు చెల్లించడం లేదని ప్రశ్నించారు. దీనికి ఎంపిపి స్పందిస్తూ వెంటనే నిర్మాణాలు వేగవంతం చేయాలని నాడు-నేడు డిఇఇ, ఎంఇఒని ఆదేశించారు.

తహశీల్దార్ సులోచనారాణి మాట్లాడుతూ రీ సర్వే సమస్యలు త్వరలోనే చక్కబడతాయని, తప్పులు నమోదైన పట్టాదారు పాసుపుస్తకాల్లో మార్పులు చేసి మళ్లీ పంపిణీకి సిద్ధం చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతిఒక్కరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. రామభద్రపురం ఎంపిటిసి భవిరెడ్డి చంద్ర, కో ఆప్షన్ సభ్యులు స్థానికంగా పేదలకు అర్హులైనా పట్టాలు రావడం లేదని, గతంలో మంజూరైన వారికి, డబ్బున్న వారికే వస్తున్నాయని సమావేశంలో ప్రస్తావించారు. తహశీల్దార్ స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలను అనుసరించే పట్టాలిస్తున్నామని, ప్రభుత్వ స్థలం చాలా ఉందని అర్హులు ఎవరైనా ఉంటే తన దృష్టిలో పెడితే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమగ్ర భూ సర్వే చాలా తప్పులతడకగా జరిగిందని, ఇనాం భూములను కూడా వేరే వారి పేరు మీద నమోదు చేశారని మడక తిరుపతిరావు నిలదీశారు. సాంకేతిక లోపాల్ని సరిచేస్తున్నామని, ఎవరైనా తప్పులు జరిగినట్లు ఫిర్యాదులు చేస్తే చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ సమాధానం చెప్పారు. గత సమావేశాల్లో లేవనెత్తిన సమస్యలకు ఈ సమావేశానికి కూడా పరిష్కారం చూపడంలో కొందరు అధికారులు నిర్లక్ష్యం చూపారని సభ్యులు ఆగ్రహం వ్యక్తంచేశారు.

సమావేశంలో ఎంపిడిఒ రమామణి, జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతి, వివిధ శాఖల అధికారులు, సీనియర్ సహాయకులు చొక్కాపు శ్రీరాములునాయుడు తదితరులు పాల్గొన్నారు.

డీలర్ల కుటుంబాలకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- మెరకముడిదాం

మండలంలో ఎన్నో ఏళ్లుగా రేషన్ షాప్ డీలర్లగా పనిచేస్తూ ఇటీవల మృతి చెందిన ఆయా డీలర్ల కుటుంబాలకు రాష్ట్ర డీలర్ల యూనియన్ సంఘం గౌరవ అధ్యక్షులు, జిల్లా డీలర్ల యూనియన్ ప్రెసిడెంట్ బుగత వెంకటేశ్వరరావు, సముద్రపు రామారావు, నారాయణరావులు ఒక్కొక్క కుటుంబానికి పదివేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందచేశారు. 2015-2023 సంవత్సర మధ్య కాలంలో మృతి చెందిన బైరిపురం-1, గర్భాం, చెల్లాపురం, సీరియాలపేట, సాతాంవలస, భీమవరం డిపోలకు చెందిన డీలర్ల కుటుంబాలకు ఈ సహాయం అందజేశారు. అనంతరం బుగత వెంకటేశ్వరరావు మాట్లాడుతూ బయటకు రేషన్ షాప్ డీలర్లగా తెల్ల చొక్కాలు వేసుకొని గౌరవంగా చలామని అవుతున్నప్పటికి ఎంతో మంది కుటుంబ పోషణ గడవక ఆర్థికంగా చితికి పోయారన్నారు. డీలర్ల సంక్షేమం కోసం యూనియన్ నుండి ఎంతో కొంత సహాయం చేద్దాం అనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జిల్లా రెవెన్యూ గస్ట్ హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలోని అన్ని మండలాల డీలర్లు పాల్గొన్నారు.

ఆసరాతో అక్కచెల్లెమ్మలకు భరోసా

ఎమ్మెల్యే శంబంగి


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు

ప్రజాశక్తి-తెర్లాం

ఆసరా పథకంతో అక్కచెల్లెమ్మలకు ఆర్థిక భరోసా లభిస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. నాలుగో విడత ఆసరా సంబరాలను సోమవారం తెర్లాంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసరా చెక్కును డ్వాక్రా మహిళలకు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 4432 సంఘాల్లో 53,184 మంది అక్కచెల్లెమ్మలకు గాను రూ.70.85 కోట్లను నాలుగో విడతలో విడుదల చేసినట్లు తెలిపారు. తెర్లాం మండలంలో 1142 మహిళా సంఘాల్లో 13,704 మందికి రూ.5.89 కోట్ల లబ్ధి చేకూరిందని వివరించారు. గతంలో చంద్రబాబు మహిళలకు ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చకుండా మోసం చేశారని ఆరోపించారు. నేడు సిఎం జగన్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో పూర్తి రుణ మాఫీ చేశారన్నారు. రాబోయే ఎన్నికల్లో మహిళలందరూ జగన్‌ను ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎపిడి సావిత్రి, ఎంపిపి నర్సుపల్లి ఉమాలక్ష్మి, జెడ్‌పిటిసి ఉర్దు, ఎఎంసి చైర్మన్ బొమ్మి శ్రీనివాసరావు, వైస్ ఎంపిపిలు చేపేన సత్యనారాయణ, పెనుమత్స రమాదేవి, వైసిపి మండల అధ్యక్షులు తెంటు సత్యంనాయుడు, యువజన విభాగం మండల అధ్యక్షులు మదాసు శేషగిరి, వైసిపి నాయకులు బొమ్మి అప్పలనాయుడు, మద్రాపు జగన్నాథం, గర్భాపు రామారావు పాల్గొన్నారు.

జోగేంద్రనాథ్‌కు ఘన నివాళి

బొబ్బిలి : అట్టడుగు వర్గాల అభ్యున్నతికి మహాప్రాణ్ జోగేంద్రనాథ్ పని చేశారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు తెలిపారు. పట్టణంలోని సంఘువీధిలో జోగేంద్రనాథ్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా జోగేంద్రనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో జోగేంద్రనాథ్ కీలకపాత్ర పోషించారని అంబేద్కర్ పోరాట సమితి అధ్యక్షులు సొరు సాంబయ్య తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఎం.జగన్నాథం, విల్సన్ బాబా పాల్గొన్నారు.

ఒప్పంద జిఒలను విడుదల చేయాలి



ధర్నా చేస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- రాజాం

మున్సిపల్ కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ కార్మికుల రాష్ట్ర వ్యాప్త సమ్మె సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిన ఒప్పంద జీవోలను వెంటనే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సిహెచ్ రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. రాజాం మున్సిపల్ కార్యాలయం వద్ద సోమవారం కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రామ్మూర్తినాయుడు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చల్లో అంగీకరించిన ఒప్పందాలకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం మీద నమ్మకంతో సమ్మె విరమించి 15 రోజులు గడుస్తున్నా చర్చల్లో చేసుకున్న ఒప్పందాలకు సంబంధించి జీవోలు విడుదల చేయకుండా జాప్యం చేస్తుందని ఆగ్రహించారు. సమ్మె కాలానికి వేతనం చెల్లించడంలో జాప్యం చేస్తున్నారన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.21వేలు, డ్రైవర్లకు రూ.24,500, దహన సంస్కార ఖర్చులు రూ.20వేలు చెల్లింపు, విధుల్లో చనిపోయినవారికి నష్టపరిహారం, బకాయిలు, సరెండర్ లీవ్‌లు, 23 శాతం వేతనం పెంపు తదితర ఒప్పందాలకు సంబంధించిన జీవోలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎమ్మెల్యేలకు వినతిపత్రం ఇస్తామని తెలిపారు. సమస్యలపై ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పరిష్కరించాలని లేదంటే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. ధర్నాలో యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, అనిల్ కుమార్, లక్ష్మీ, గురువులు, గిరిబాబు, సింహాచలం, శోభన్ బాబు, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలని ధర్నా


ధర్నా చేస్తున్న గిరిజనులు, గిరిజనసంఘం, సిపిఎం నాయకులు

ప్రజాశక్తి- మెంటాడ

మండలంలో గిరిజనులు సాగుచేస్తున్న భూములకు పాసు పుస్తకాలు ఇవ్వాలని గిరిజన సంఘం మండల కార్యదర్శి తామరాపల్లి సోములు, సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు డిమాండ్ చేశారు. సోమవారం తహశీల్దార్ కార్యాలయ ఆవరణలో గిరిజనులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా రాకోటి రాములు మాట్లాడుతూ మండలంలో సాగు భూములను సర్వే నిర్వహించి అర్హత ఉన్న గిరిజన, దళితులకు సాగు పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్ టి.రామకృష్ణకు వినతిపత్రాన్ని అందజేశారు. అర్హత ఉన్న ప్రతి నిరుపేదకు భూములను సర్వే చేసి అందజేస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చారు.

పోలీసులపై ఫిర్యాదులకు ప్రత్యేక అథారిటీ

ప్రజాశక్తి-విజయనగరం కోట

పోలీసులపై చర్యలకు సంబంధించి ప్రజల ఫిర్యాదుల పరిష్కారం కోసం జిల్లా పోలీసు ఫిర్యాదుల ప్రాధికార (అథారిటీ) సంస్థ పనిచేస్తుందని ఆ సంస్థ చైర్మన్, విశ్రాంత జిల్లా జడ్జి ఎ. వర ప్రసాదరావు తెలిపారు. తీవ్రమైన దుష్ప్రవర్తన కారణంగా కస్టడీలో మృతి, దాడి, అత్యాచారం వంటి ఘటనలు జరిగిన సందర్భంలో విచారణ నిర్వహించి పోలీసులపై చర్యలకు తమ సంస్థ సిఫార్సు చేస్తుందని చెప్పారు. ఆర్అండ్‌బి అతిథి గృహంలో సోమవారం ఉదయం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మానవ హక్కులను ఉల్లంఘించే కానిస్టేబుల్ నుంచి డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ స్థాయి వరకు ఉన్న పోలీసు అధికారులపై ఫిర్యాదులను పరిశీలించడానికి జిల్లా స్థాయిలో ఈ అథారిటీ పనిచేస్తుందని, పోలీసు సూపరింటెండెంట్ స్థాయి అంతకంటే ఎక్కువ స్థాయి అధికారులపై ఫిర్యాదులను పరిశీలించడానికి రాష్ట్ర స్థాయిలో విశ్రాంత జస్టిస్ ఉమాదేవి నేతృత్వంలో మరో అథారిటీ పని చేస్తున్నదని తెలిపారు.

ప్రజలను తమ కార్యాలయాలకు పిలిపించి చట్టవిరుద్ధంగా నిర్బంధించడం, శారీరక హింస, మాటలతో దుర్భాషలాడడం వంటి ఘటనలలో సంబంధిత పోలీసు అధికారుల చర్యల కోసం తమకు పిటిషన్లు అందజేయవచ్చని చెప్పారు. ఫిర్యాదులు నేరుగా గాని ఆన్లైన్ ద్వారా గాని లేదా 9494841172 నెంబర్‌ను సంప్రదించడం ద్వారా గాని అందజేయ వచ్చన్నారు. 2021 జూలైలో ఏర్పడిన ఈ అథారిటీకి ఇప్పటివరకు 54 ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. సమావేశంలో చైర్మన్‌తో పాటు సభ్యులు విశ్రాంత అదనపు జాయింట్ కలెక్టర్ పి.రజనీకాంతరావు, రెడ్ క్రాస్ రాష్ట్ర వైస్‌చైర్మన్ పి.జగన్మోహన్రావు, విశ్రాంత అధికారి కె.రంగరాజు ఉన్నారు.

నేడు సర్పంచుల దీక్ష

ప్రజాశక్తి -పూసపాటిరేగ

మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా ఈ నెల 30న విజయనగరం కలెక్టరేట్ వద్ద చేపడుతున్న సర్పంచుల నిరసన దీక్షలకు జిల్లాలోని పంచాయతీ రాజ్ చాంబర్ సర్పంచులు, ఎంపిటిసిలు హాజరవ్వాలని జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు రౌతు స్వామినాయుడు తెలిపారు. పంచాయతీ రాజ్ చాంబర్, సర్పంచుల సంఘం అధ్యక్షులు వై.వి.బి రాజేంద్రప్రసాద్, వానపల్లి లక్ష్మీ ముత్యాలరావుల పిలుపు మేరకు నిరసన దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య సాధనే లక్ష్యంగా 73, 74 రాజ్యాంగ సవరణలోని ఆర్టికల్ 243లో 11వ షెడ్యూల్లో పేర్కొన్న 29 అంశాలలోని నిధులు, విధులు, అధికారాలను స్థానిక సంస్థల ప్రజా ప్రతినిధులైన సర్పంచ్, ఎంపిటిసి, జెడ్‌పిటిసి, ఎంపిపి, జిల్లా పరిషత్ చైర్మన్‌లకు బదలాయించాలన్నారు. గ్రామపంచాయతీ, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులను బలోపేతం చేయాలన్నారు. సర్పంచుల 16 డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ దీక్ష చేపడుతున్నా మన్నారు. ఈ నిరసన దీక్షలో రాజకీయాలకతీతంగా జిల్లాలోని సర్పంచులు, ఎంపిటిసిలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.


గ్రంథాలయాల పట్ల నిర్లక్ష్యం అన్యాయం


దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

విద్యార్థులు, యువతకు విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం అన్యాయమని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన అన్నారు. ప్రభుత్వ శాఖా గ్రంథాలయాన్ని బాగు చేయాలని కోరుతూ పట్టణంలోని ఎన్‌టిఆర్ బొమ్మ జంక్షన్ వద్ద జనసేన రాష్ట్ర ప్రచార కార్యదర్శి బాబు పాలూరి నిరాహార దీక్ష చేశారు. ఈ దీక్షకు బేబినాయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ భవనాన్ని ప్రభుత్వం బాగు చేయకపోతే సొంత నిధులతో అభివృద్ధి చేస్తామన్నారు. బాబు పాలూరి మాట్లాడుతూ గ్రంథాలయ భవనాన్ని బాగు చేయాలని ఏడాది నుంచి ఆందోళన చేస్తే నిర్లక్ష్యం చేస్తున్నారని తెలిపారు. దీక్షకు లోక్ సత్తా జిల్లా అధ్యక్షులు ఆకుల దామోదర్ మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ఎస్.గంగాధర్, టిడిపి పట్టణ అధ్యక్షులు రాంబార్కి శరత్, సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, జనసైనికులు పాల్గొన్నారు.

'చిత్రలేఖనం'లో 'చలపతి' విద్యార్థుల సత్తా



సాధించిన బహుమతులతో విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అఖిల భారత బాలల చిత్ర రేఖన పోటీలను ప్రతాప్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పెయింటింగ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ పోటీల్లో చలపతి పాఠశాలకు చెందిన 65మంది విద్యార్థులు బంగారు పతకాలతో పాటుగా సర్టిఫికెట్లు పొందారు. ఈ నేపథ్యంలో విద్యార్థులకు బహుమతులను పాఠశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం ఆధ్వర్యంలో అందజేశారు. ఈ విజయానికి కారకులైన అధ్యాపక బృందాన్ని పాఠశాల డైరెక్టర్ అభినందించారు. విద్యార్థులకు విద్యతో పాటు వారిలోని సృజనాత్మకతను వెలికి తీయడమేనని పాఠశాల డైరెక్టర్ రాజేష్ తెలిపారు.

నేడు అమరవీరుల వర్ధంతి సభ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జ్యూట్ కార్మిక అమరవీరుల 30వ వర్ధంతి సభలు జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి బి. గీత పిలుపునిచ్చారు. సోమవారం జరజాపు పేట అమర వీరుల స్థూపం వద్ద కర పత్రాలు విడుదల చేశారు. అనంతరం జ్యూట్ మిల్ గేటు వద్ద వర్ధంతి వేడుకల కర పత్రాలతో ప్రచారం చేశారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 29 నుండి ఫిబ్రవరి 4 వరకు అమర వీరుల వర్ధంతి సభలు నిర్వహించడానికి ఐయఫ్‌టియు రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందన్నారు. వర్ధంతి వేడుకలు సందర్భంగా స్థూపం వద్ద జెండా ఆవిష్కరణ జరిపి సభలు నిర్వహిస్తామని 4న నెల్లిమర్ల కార్మిక అమర వీరుల స్థూపం భవనంలో బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కాళ్ల అప్పలసూరి, నామాల తిరుపతి, జిల్లా సీనియర్ నాయకులు సింహాచలం, పిఒడబ్ల్యు రాష్ట్ర నాయకులు వెంకటలక్ష్మి, జిల్లా అధ్యక్షులు పార్వతి, ఎఐకెఎమ్ జిల్లా నాయకులు వి మల్లేష్ పాల్గొన్నారు.

జెజెఎం నిధులు రూ.1.08 కోట్లు మంజూరు


శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని వీలుపర్తి సచివాలయ పరిధిలో శాశ్వత తాగునీటి పరిష్కారానికి జలజీవన్‌మిషన్ నిధులు రూ.1.08 కోట్లు మంజూరయ్యాయి. సచివాలయ పరిధిలో కొలుకుపాలెం, బొర్రావలస, రాయుడుపేట, దుంగాడ గ్రామాల్లో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేయనున్నారు. ఈ మేరకు తాగునీటి కుళాయిల పనులను సోమవారం అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడిరాజు, జెఇ దేవి, ఎంపిడిఒ బిఎస్‌కెఎన్ పట్నాయక్, ఎంపిపి డి.సత్యవంతుడు, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, సర్పంచ్ సేనాపతి లీల పాల్గొన్నారు.

జగన్‌ను గద్దెదించేందుకు ప్రజలు సిద్ధం

టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ

ప్రజాశక్తి-వేపాడ

వచ్చే ఎన్నికల్లో సిఎం జగన్‌మోహన్‌రెడ్డిని గద్దె దించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ తెలిపారు. సోమవారం మండలంలోని ఎ.జె.పాలెంలోని తన నివాసంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఎన్నికలకు 'నేను సిద్ధం.. మీరు సిద్ధమా..' అంటూ బహిరంగ సభల్లో మేకపోతు గాంబీర్యం ప్రదర్శిస్తుంచడం విడ్డూరంగా ఉందన్నారు. సిఎంకు అంత తొందర ఎందుకని, ప్రజలే గద్దె దింపడానికి సిద్ధంగా ఉన్నారని ఎద్దేవాచేశారు. రాక్షస పాలన నుంచి ఎప్పుడు విముక్తి కలుగుతుందా? అంటూ ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. టిడిపి, జనసేన పార్టీ కూటమి విజయాన్ని ఎవరూ ఆపలేరని చెప్పారు. వ్యవస్థలను నిర్వీర్యం చేసి ఎన్నాళ్లు పాలన సాగిస్తారని ప్రశ్నించారు. పజలు ఇప్పటికే జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కుడులో ఉన్న మోసాన్ని గుర్తించారని చెప్పారు. సొంత సొమ్ము ఇచ్చినట్లు విస్తృతంగా ప్రచారం చేసుకోవడం పట్ల అన్ని వర్గాల వారు కూడా తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

నేరాలు ఘోరాలు

పట్టుబడిన ద్విచక్ర వాహనాల దొంగ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ద్విచక్ర వాహనాల దొంగను సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పట్టుకున్నట్లు వన్ టౌన్ డిఎస్‌పి కె.గోవిందరావు తెలిపారు. సోమవారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో డిఎస్‌పి మాట్లాడారు. ఇటీవల బైక్ దొంగతనాలు పెరిగాయని, దీంతో వన్‌టౌన్ టీంతో స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామని తెలిపారు. సోమవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఒక వ్యక్తి (మైనర్ బాలుడు)ని అనుమాన స్థితిలో పట్టుకున్నట్లు తెలిపారు. మరొక బాలుడి సాయంతో ఈ దొంగతనాలు చేస్తున్నట్లు గుర్తించామన్నారు. 12 బైకులు దొంగతనం చేసినట్లు అంగీకరించాడని తెలిపారు. తిరుపతయ్య పాలెంలో దుప్పాడ దుర్గాప్రసాద్ ఈ బైకులు డిస్పోజలు చేస్తున్నట్లు తేలిందన్నారు. స్పెషల్ డ్రైవ్ లో పాల్గొన్న వన్ టౌన్ సిఐ వెంకట్రావు , ఎస్ఐ తార్కేశ్వరరావు, సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

రైలు పట్టాలపై యువకుడి మృతదేహం

హత్యగా భావిస్తున్న పోలీసులు ● డాగ్ స్క్వాడ్‌తో పరిశీలన


ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

నగరంలోని అలకానంద కాలనీకి చెందిన ఎజ్జిరోతు రమేష్ (28) మృతదేహం సోమవారం అనుమానస్పద స్థితిలో రైలు పట్టాలపై లభ్యమయింది. ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన రమేష్ తల్లి లక్ష్మి తో కలిసి స్థానిక అలకానంద కాలనీలో నివాసం ఉంటున్నాడు. లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్న రమేష్ ఆదివారం రాత్రి తన తల్లి లక్ష్మి వద్ద మద్యం సేవించేందుకు డబ్బులు తీసుకొని బయటకు వెళ్లాడు. తొందరగా వచ్చేస్తానని, అన్నం వండేసి ఉంచమని చెప్పి వెళ్లాడు. మద్యం కోసం బయటకు వెళ్లిన ఆయన అలకానంద కాలనీకి, ఇందిరానగర్‌కు మధ్య రైలు పట్టాలపై శవమై కనిపించాడు. రమేష్ తల, మొండెం వేరువేరుగా పట్టాలపై పడి ఉన్నాయి.

బయటికి వెళ్లిన తన కుమారుడు ఎంతసేపటికి ఇంటికి రాకపోయేసరికి తల్లి లక్ష్మి రాత్రంతా ఎదురుచూసింది. తెల్లవారి పట్టాలపై గుర్తుతెలియని మృతదేహం ఉందని సమాచారాన్ని తెలుసుకొని ఆమె వెళ్లి చూసి, విగతజీవిగా పడి ఉన్న తన కుమారుడు రమేష్‌ను చూసి కన్నీటి పర్యంతరమైంది. జిఆర్‌పిఎఫ్ ఎస్ఐ రవి వర్మ మృతదేహం పడి ఉన్న తీరును చూసి అనుమానస్పద మృతిగా గుర్తించి, స్థానిక వన్ టౌన్ పోలీసులకు సమాచారం అందజేశారు. వన్ టౌన్ సిఐ బి. వెంకటరావు ఘటన స్థలాన్ని పరిశీలించారు. అన్ని లైన్ల పట్టాలపైనా రక్తపు మరకలు ఉండడంతో హత్యగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. క్లూస్ టీం సహకారంతో అక్కడ ఉన్న ఆధారాలను పోలీసులు సేకరించారు. మృతుని తల్లి లక్ష్మి, అక్క పార్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్ టౌన్ పోలీసులు, విజయనగరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు.